ఏఈ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే పరామర్శ



ఏఈ శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ బాధ్యత ఎంత ముఖ్యమో ఆరోగ్యం కాపాడుకోవడం అంతకంటే ముఖ్యమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్ ఏఈ శ్రీనివాస్ గుండెపోటుతో మియాపూర్ మాతృశ్రీనగర్ పల్స్ హార్ట్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయిన విషయం ఎమ్మెల్యే తెలుసుకొని బుధవారం అక్కడికెళ్లి ఆయన్ని పరామర్శించారు. హార్ట్‌కు వేసిన స్టంట్ గురించి వైద్యులనడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

- జలమండలి అధికారులను కోరిన కార్పొరేటర్



కరెంట్ ఆఫీస్ గల్లీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం, జలమండలి అధికారి సెక్షన్ మేనేజర్ అన్వేత్ కుమార్

అల్లాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ కరెంట్ ఆఫీస్ గల్లీలో కార్పొరేటర్ సబీహా బేగం జలమండలి అధికారి సెక్షన్ మేనేజర్ అన్వేత్ కుమార్, సిబ్బందితో కలిసి బుధవారం పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌లలో సిల్ట్ అధికంగా పేరుకుపోయి మురుగు సమస్యలు తలెత్తుతున్నాయంటూ తరచూ ఫిర్యాదులొస్తున్నాయని జలమండలి అధికారుల దృష్టికి తెచ్చారు. రానున్నది వర్షాకాలం కావున ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ఇదే మంచి తరుణం అనుకున్న కార్పొరేటర్ సత్వరమే సిల్ట్ సమస్యలను ఓ కొలిక్కి తెచ్చి వానాకాలం సర్‌ప్రైజ్‌లను అరికట్టాలని కోరారు. ఎప్పటికప్పుడు మ్యాన్‌హోల్‌లలోని పూడికను తొలగించాలని కార్పొరేటర్ సబీహ బేగం జలమండలి అధికారులను కోరారు.

చెత్త డబ్బాలు వినియోగించేలా చూడాలి : జడ్సీ



ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీరోడ్డులో రాంకీ సంస్థ ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలను పరిశీలిస్తున్న కూకట్‌పల్లి జడ్సీ అపూర్వచౌహాన్, ఏఎంహెచ్‌వో కార్తీక్

ఫతేనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): బస్తీలలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న చెత్త డబ్బాలలో స్థానికులు చెత్తను రోడ్డ మీద కాకుండా చెత్త డబ్బాలలోనే వేసే విధంగా ప్రజలకు వివరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్ అధికారులకు, శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీ రోడ్డులో రాంకీ సంస్థ కొత్తగా ఏర్పాటు చేసిన 35 లీటర్ల చెత్త డబ్బాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ, ఇప్పటికే డివిజన్ పరిధిలోని జింకల వాడ తదితర బస్తీలలో చెత్తడబ్బాలు పెట్టడం జరిగిందని అవి సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనని సూచించారు. కార్యక్రమంలో మూసాపేట్ సర్కిల్ ఏఎంహెచ్‌వో కార్తీక్, జమీల్ అహ్మద్, ఎస్సార్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

బాలానగర్, మే 14(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి(త్రివేణి సంగమం)కు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోందని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ డి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతి పుష్కర స్నానం చేయాలనుకునే యాత్రికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే కాలనీ నుంచి 40 మంది ప్రయాణికులు ఉంటే ఆ కాలనీకి బస్సును పంపిస్తామన్నారు. గురువారం (మే 15) నుంచి 26వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 8919493417ను సంప్రదించాలని డీఎం పేర్కొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రాజీవ్‌గాంధీనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బాలానగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించకపోతే సహించేది లేదని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ ఏఈ ఆశ, జలమండలి మేనేజర్ సతీష్, రాజీవ్ గాంధీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జనరల్ సెక్రెటరీ ఎం.కే. నరేష్, స్థానికులు షేక్ అరబ్, మోయిజ్, వినోద్, అన్వేష్, బస్తీ వాసులు పాల్గొన్నారు.



దీనదయాల్‌నగర్‌లో నాలాలో పేరుకు పోయిన చెత్తను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

నాలాలో చెత్త తొలగింపు

ఫతేనగర్, మే 14(ఆంధ్రజ్యోతి): దీనదయాల్‌నగర్ 'నాలాలో పేరుకుపోయిన చెత్త- ఇబ్బందుల్లో స్థానికులు' అనే శీర్షికతో ఈ నెల 12 ప్రచురితమైన కథనానికి మూసాపేట్ సర్కిల్ అధికారులు బుధవారం స్పందించారు. డివిజన్ ఏఈ రాధాకృష్ణ పర్యవేక్షణలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది జేసీబీ సహాయంతో నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పనులను జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ పరిశీలించారు.

ఈ ప్రభుత్వ కళాశాల

చదువులో టాప్



కూకట్‌పల్లి న్యూ గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రధాన ముఖద్వారం

- ఇంటర్ ఫలితాల్లో జిల్లా టాపర్లు ఇక్కడి విద్యార్థులే
- కూకట్‌పల్లి న్యూ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో దరఖాస్తులు ఆహ్వానం

కేపీహెచ్‌బీకాలనీ, మే 14 (ఆంధ్రజ్యోతి) : చదవాలన్న పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదు.. అరకొర వసతులు ఉన్నా ప్రైవేట్, కార్పొరేటర్ కళాశాలలకు దీటుగా మార్కులు తెచ్చుకోవచ్చు. చదువు కోసం అప్పులు చేసే తల్లిదండ్రులు నాణ్యమైన ఒత్తిడిలేని విద్యను అందిస్తున్న కూకట్‌పల్లి న్యూ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో చేర్పించవచ్చు. ఇక్కడ చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి ఉన్న వారికి ప్రోత్సాహం ఉంటుంది. 1200 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 2024-25లో వెలువడిన ఇంటర్ ఫలితాల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విజేతలుగా ఇక్కడి విద్యార్థులే నిలిచారు. దీంతో ఇక్కడ ప్రవేశాలకు డిమాండ్ పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కళాశాల ప్రత్యేకతలు

జిల్లాలో ఉన్న కళాశాలల్లోకెల్లా కూకట్‌పల్లికి ప్రత్యేక స్థానం ఉంది. పేద విద్యార్థులకు ఇది ఒక వరం అని చెప్పవచ్చు. ఈ ఏడాది వచ్చిన రిజల్ట్‌తో రాష్ట్రవ్యాప్తంగా ఈ కళాశాలపై విద్యాశాఖ దృష్టిలో పడింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఏడాదిల్లో వచ్చిన మార్కులు, పాస్ పర్సంటేజీలతో అదరహో అనిపించింది. ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 466/470 జ్యోతిలక్ష్మి, బైపీసీ సెకండ్ ఇయర్ 990/1000 ప్రియాంక గుప్తా సాధించడంతో జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలెక్టరేట్‌కు పిలిపించుకొని అభినందించారు. క్రికెట్‌లో జాతీయస్థాయిలో ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని శారద అహ్మదాబాద్‌లో ఆడారు. షూటింగ్‌లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారు. తైక్వాండోలో రాష్ట్రస్థాయిలో విద్యార్థి రాణించారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేందుకు ఇక్కడ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. కళాశాలకు సరిపడా లెక్చరర్స్ ఉన్నారు. అన్నీ సబ్జెక్టుల్లో నిపుణులైన ఫ్యాకల్టీ ఉండటంతో చదువులో రాణించాలన్న తపన ఉన్న విద్యార్థులను గుర్తించి మరింత ప్రోత్సహిస్తున్నారు. దీంతో జిల్లా, రాష్ట్రస్థాయిలో ఇక్కడి విద్యార్థులకు మంచి మార్కులు రావడంతో ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.



ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉద్యోగులు

ఆఫర్ చేస్తున్న కోర్సులు

2025-26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. కళాశాల సమయ వేళలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో సీజీఏ(కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్), ఎ అండ్‌టి (అకౌంట్ అండ్ ట్యాక్సేషన్), పీఎస్‌టీటీ (ప్రీప్రైమరీ స్కూల్ టీచర్ ట్రైనింగ్)లో అడ్మిషన్లకు దరఖాస్తులు తీసుకుంటున్నారు. గత ఏడాది అన్ని కోర్సులకు కలిపి ఫస్ట్ ఇయర్‌లో 647 మందిని తీసుకున్నారు.

ఇక్కడ చేరిన వారికి బంగారుబాట వేస్తాం



ప్రభుత్వ జూనియర్ కళాశాల పేరుకు మాత్రమే. ఇక్కడ విద్యాబోధన, క్రీడల పట్ల చొరవ చూపిస్తే కార్పొరేట్ కాలేజీలకు ఏమాత్రం తీసిపోదు. కళాశాలలలో అరకొర వసతులను చూసి వెనక్కిపోకుండా చదువుకోవాలనుకునే వారి భవిష్యత్తుకు బంగారుబాట వేసేలా చూస్తాం. పిల్లల చదువు, ప్రవర్తన, హాజరుశాతం ఇతరత్రా అంశాల గురించి అన్ని పనిదినాల్లో లెక్చరర్స్ లేదా ప్రిన్సిపాల్‌ను సంప్రదించవచ్చు. 75శాతం హాజరుఉన్నవారు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా చూస్తున్నాం. కళాశాలకు రెగ్యులర్‌గా వచ్చేలా తల్లిదండ్రులు కూడా చూడాల్సిన బాధ్యత ఉంది. బోధన విషయంలో పిల్లల గురించి మమ్మల్ని నిలదీసి అడిగే హక్కును వారి తల్లిదండ్రులకు కల్పిస్తున్నాం. పేరెంట్స్ మీటింగ్స్‌తో పాటు ఎప్పుడైనా మమ్మల్ని కలిసే అవకాశం ఉంది.

- బోడ వెంకటయ్య, ప్రిన్సిపాల్, న్యూ గవర్నమెంట్ జూనియర్ కళాశాల కూకట్‌పల్లి

కరెంట్ తీగల సమస్యను పరిష్కరించండి

డీఈ గోపాల్‌రావుకు సమతానగర్‌వాసుల వినతి

ఓల్డుబోయినపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధి సమతానగర్‌లో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ట్రాన్స్‌ఫార్మర్‌లో పెద్ద శబ్దం వచ్చి ఫ్యూజ్‌లు కాలిపోయి కరెంట్ సరఫరా నిలిచిపోతున్నదని ఆ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. తీగ మధ్య దూరం తక్కువ ఉండటం వల్ల చిన్నపాటి గాలి వేసినా, పక్షులు వాలినా తీగలు ఒకదానికొకటి తగులుతున్నాయని, గాలికి చెట్లకొమ్మలు, తీగలకు తాకినా కరెంట్ పోతున్నదని, సమస్యను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం బోయినపల్లి డీఈ గోపాల్‌రావును ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను తాము స్థానిక విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని డీఈకి వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒకదానికొకటి తగలకుండా తీగల మధ్య దూరం ఉంచి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



డీఈ గోపాల్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న సమతానగర్ సంక్షేమ సంఘం సభ్యులు

డీఈని కలిసిన వారిలో సమతానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లోహిదాస్, కార్యదర్శి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు రాంచందర్‌రావు, సహాయక కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రోత్సాహకం

సగం ఖర్చు భరించనున్న సంక్షేమ సంఘం

అల్లాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రి నగర్ కాలనీ సంక్షేమ సంఘం వారు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఇంజెక్షన్ బోరుబావులు, ఇంకుడు గుంతల ఏర్పాటుతో వేసవి, నీటి ఎద్దడి సమస్యలకు చెక్ పెట్టొచ్చన్న ఆలోచనతో తమ కాలనీలో వాటిని ఏర్పాటు చేసుకునేవారికి ప్రోత్సాహకంగా సగం ఖర్చును సంక్షేమ సంఘం తరఫున భరించనున్నట్టు నిర్ణయించారు. ఈ విషయమై కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారావు ఓ ప్రకటన చేశారు. కాలనీలో, సమాజంలో మంచి పనులకు ప్రోత్సాహం దక్కాలన్న ప్రాతిపదికన కొందరు దాతలు భూగర్భ నీటి రీచార్జ్ పనులకు ఇంటి యజమానులు సగం ఖర్చు భరిస్తే తాము మిగతాది ప్రోత్సాహకంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం ఇంటి యజమానులు ట్యాంకర్‌కు రూ.500 నుంచి రూ.650 వరకు, అపార్టుమెంటయితే రూ.1,000 నుంచి రూ.1,300 వరకు వెచ్చించాల్సి ఉంటుందని, ఇంకుడు గుంతలు, ఇంజెక్షన్ బోర్‌వెల్స్‌తో ఆయా ఖర్చును నివారించవచ్చని కాలనీ సంక్షేమ సంఘం సభ్యుడు నాగేశ్వర రావు తెలిపారు. ఇప్పటికే కే.ఎస్. గ్రామర్ స్కూల్ సమీపంలోని తమ వీధిలో ఇలాంటి ఏర్పాట్లతో తమ వీధిలోని బోరుబావులు ఇంకా యాక్టివ్‌గా ఉన్నాయని, కాలనీలోని దాదాపు అన్ని బోర్లు ఒట్టిపోయిన పరిస్థితి ఉన్నా తమ వీధిలోని బోర్లు సరిచేయుటకు కారణం ఇంజెక్షన్ బోర్లని ఆయన పేర్కొన్నారు.



గాయత్రి నగర్‌లోని ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన ఇంజెక్షన్ బోరుబావి



కాలనీలోని ఒకరు తవ్వించుకున్న ఇంకుడు గుంత (ఫైల్)

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 14 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోట 13, వంకాయ 18, బెండకాయ 35, పచ్చి మిర్చి 40, బజ్జి మిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 40, క్యాబేజీ 13, బీన్స్ 115, క్యారెట్ 25, గోబి పువ్వు 23, దొండకాయ 23, చిక్కుడు కాయ 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 47, ఆలుగడ్డ 25, కీర 28, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 15, కంద 65, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 18, మామిడి కాయ 15-20, అరటికాయ 9-11, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడ దుంప 25, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 60-70, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 85, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పెండింగ్ పనులు పూర్తి చేయిస్తా

- కార్పొరేటర్ సతీష్‌గౌడ్



శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో డివిజన్ పరిధిలోని 10 శ్మశాన వాటికల అభివృద్ధి, సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. బుధవారం ఉదయం డివిజన్ పరిధి ఇందిరాగాంధీపురం ముస్లిం శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను ముస్లిం పెద్దలతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కృష్ణారావు సిఫార్సు మేరకే అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గౌస్, అన్వర్, షౌకత్, సలీం, సంతోష్, ఖైసర్, ఆరీఫ్, రాజేశ్, అస్మత్ పాల్గొన్నారు.

ఇవేం రోడ్లు?

- కూకట్‌పల్లి డివిజన్‌లో అధ్వానంగా మారిన రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- మండిపడుతున్న స్థానికులు



కూకట్‌పల్లి డివిజన్‌లో ఓ రోడ్డు దుస్థితి

కూకట్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లు పూర్తిగా గోతులమయంగా మారాయి. మండు వేసవిలో కురిసిన చిన్నపాటి వర్షాలకే కూకట్‌పల్లి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. చాలా రోడ్లు చిత్తడిగా మారాయి. ఈ పాటికే 80శాతానికి పైగా రోడ్డు పనులు పూర్తి చేసిన అధికారులు నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇవ్వడంతో పలుకాలనీల్లో ఎక్కడ చూసినా వర్షపునీరే కనిపిస్తుంది. కొన్నిచోట్ల అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ప్రకాశ్‌నగర్ రోడ్డు విషయంలో గతంలోనే ఇంజనీరింగ్ అధికారుల వివరణ కోరగా ఇప్పటికే నిధులు మంజూరైనట్లు చెబుతున్నారు. అయితే పనులు మాత్రం ఎందుకు ప్రారంభించడం లేదో ప్రశ్నార్థకంగా మారింది.

అస్తవ్యస్తంగా ప్రకాశ్‌నగర్ రోడ్డు

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. గుంతలో చేరిన వరదనీటితో రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. గతంలోనే రోడ్డు వేసిన మరికొన్ని కాలనీలలో సైతం వరదనీరు రోడ్లపై నిలిచి ఉంటుంది. పాపారాయుడు నగర్, విజ్ఞాన్‌పురి కాలనీ ఆస్‌బెస్టస్‌కాలనీ, దీనబంధుకాలనీ, రామారావునగర్‌తో పాటు మరికొన్ని కాలనీల్లో రోడ్డుపై నిలిచిన నీటితో జనాలు ఇబ్బందులు పడుతున్నారు.

ఒక డివిజన్.. రెండు నియోజక వర్గాలు

మహానగరంలో కూకట్‌పల్లికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అందులో కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో రెండు నియోజకవర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఒకవైపు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరికొన్ని కాలనీలు శేరిలింగంపల్లి పరిధిలోకి వస్తున్నాయి. అయితే కార్పొరేటర్ మాత్రం ఒక్కరే ఉన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు

వర్షాకాలం రావడానికి మరో నెల రోజులకు పైగా సమయం ఉంది. అయితే మండు వేసవిలో కురుస్తున్న చిన్నపాటి వానలకే కూకట్‌పల్లిలోని కొన్ని ప్రాంతాలు పూర్తిగా బురదమయంగా మారాయి. అడుకో గుంత ఉండటంతో ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. బురదరోడ్డులో ద్విచక్రవాహనాలు జారిపడే ప్రమాదం ఉండటంతో కూకట్‌పల్లిలోని ప్రకాశ్ నగర్ రోడ్డులో ప్రయాణం చేయలేమంటూ సాయి బాబానగర్ రోడ్డు మీదుగా వాహనదారులు ప్రయాణం సాగిస్తున్నారు.



ఆస్‌బెస్టాస్ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

రోడ్లను బాగుచేయండి



కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో చాలా రోడ్లు గుంతలమయంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డుకు ఇరువైపులా ఎప్పుడూ నీరు నిల్వ ఉంటుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లను జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే బాగు చేయాలి.

- దీపక్, ఆస్‌బెస్టాస్ కాలనీ

జవహర్ నవోదయ విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం, మే14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ప్రకటించిన ఫలితాల్లో గచ్చిబౌలిలోని జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డి.విజయభాస్కర్ తెలిపారు. 12వ తరగతిలో జాహ్నవి 93 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఐదుగురు విద్యార్థులు 90 శాతంకుపైగా మార్కులు సాధించారు. హాజరైన 39 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 31 మంది వివిధ సబ్జెక్టుల్లో 90నుండి 100 మార్కులు సాధించారని తెలిపారు. జి.శాంత్‌కుమార్ 98 శాతం మొదటి ర్యాంకు సాధించారు. 14 మంది విద్యార్థులు 90కిపైగా సాధించారు. పరీక్షకు హాజరైన 79మంది విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

సత్తాచాటిన దివ్యాంగ విద్యార్థులు

రంగారెడ్డి జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి జవహర్ నవోదయ రంగారెడ్డిని ఒకే కేంద్రంగా న్యూఢిల్లీ జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఎంపిక చేసింది. ఈ విద్యాలయానికి అనుసంధానంగా ఆదిత్య మెహతా ఫౌండేషన్ విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. సీబీఎస్ఈ ప్రకటించిన 10, 12వ తరగతి బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించారు. 12వ తరగతి నుండి బి.పావని, 79శాతం తెలంగాణ, కె.లక్ష్మీకాంత్ 65శాతం కర్ణాటక, పదవ తరగతి నుండి కుమారి వాసవి 81శాతం గుజరాత్, వర్షిణి 60శాతం కర్ణాటక, నందిని70శాతం కర్ణాటక, జ్యోతి 50శాతం హర్యాన, మంగేష్ ఇండోరి 71శాతం, అభుజాక్షిత్ 77శాతం మహారాష్ట్ర ప్రతిభను చాటారు.



కొత్తగూడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థాన చతుర్థ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరికపూడి గాంధీ

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

గచ్చిబౌలి, మే 14 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ కొత్తగూడలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం చతుర్థ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఊట్ల కృష్ణ, నర్సింహ యాదవ్, రాధాకృష్ణయాదవ్, మాధవి, రమేశ్, మణిరత్నం, ప్రసాద్, వివిధ కాలనీకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

కేశవనగర్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

రాయదుర్గం, మే14 (ఆంధ్రజ్యోతి): కేశవనగర్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవ్‌నగర్‌లో ఉన్న మట్టికుప్పలు, చెత్తచెదారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వ్యాధుల వ్యాప్తి అపరిశుభ్రమైన వాతావరణంవల్లే జరుగుతుందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, శానిటేషన్ సిబ్బంది, కేశవనగర్ వాసులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో కురుస్తున్న వర్షం

శేరిలింగంపల్లిలో వర్షం

చందానగర్, మే14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. సాయంత్రం 6గంటల నుంచి ప్రారంభమైన వర్షం 7-30 వరకు కురిసింది. దీంతో ప్రజలు ఒకింత ఇబ్బందులు పడ్డారు.దీంతో కాలనీలోని అంతర్గత రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వచ్చే సమయంలో పడడంతో ప్రజలు తడిసి ముద్దయ్యారు.

20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మియాపూర్, మే14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి ఓంకార్ భవనం ఎంఏ నగర్‌లో బుధవారం ఆ సంఘాల నేతల రాష్ట్ర సదస్సు బీఎల్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దిరాములు అధ్యక్షతన జరిగింది.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

- గచ్చిబౌలి డివిజన్‌లో అనుమతులు లేకుండా నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- లేఔట్‌లో నిర్మాణాలపై మాత్రం చర్యలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

రాయదుర్గం, మే 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. కొందరి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్న అధికారులు, మరికొందరి విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గచ్చిబౌలి డివిజన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను కన్నెత్తి చూడని అధికారులు చట్టపరంగా లేఔట్‌లో ప్లాట్లు కొని ఇల్లు కట్టుకునే వారిపై ప్రతాపం చూపిస్తున్నారు. గచ్చిబౌలి గోపన్‌పల్లి, ఇందిరానగర్, టెలికాంనగర్, ఖాజాగూడ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు కబ్జా చేసి యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ కబ్జాదారులకు, అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోపన్‌పల్లి తండా పెద్దచెరువు శిఖం స్థలాన్ని కబ్జా చేసి ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగైదు అంతస్తులు నిర్మిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఆక్రమణదారుల నుంచి లంచాలు తీసుకుని వారికి సహకరిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలు

ఎన్టీఆర్‌నగర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉదయం 10, 11గంటల వరకు అక్రమ నిర్మాణాల వద్దకు వచ్చి నిర్మాణదారులతో మాట్లాడి వెళ్తున్నారు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. లేఔట్‌లో నిర్మాణాలు చేస్తుంటే అనుమతి లేదంటూ సీజ్ చేయడానికి వస్తున్న అధికారులు అసలు ఎటువంటి అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణ దారులు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి ఇలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కఠినంగా వ్యవహరిస్తాం

అక్రమ నిర్మాణాలు ఎవరు చేసినా సహించేది లేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను సీజ్ చేశాం. అక్రమ నిర్మాణ దారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. - ఏసీపీ వెంకటరమణ



భాజాగూడ సాయిఐశ్వర్య కాలనీలో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్)

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



+ కోనేరులో స్వామివారికి చక్రస్నానం, అభిషేకాలు



లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి ఊరేగింపు

ఖేల్‌కాలనీ, మే14 (ఆంధ్రజ్యోతి): కోనేరులో స్వామివారికి జరిగిన చక్రస్నానం వైభవంగా జరిగింది. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోగల శ్రీ వేంకటేశ్వర, యేగేశ్వర స్వామి దేవస్థానంలో గల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వారంరోజుల పాటు జరిగిన దేవాలయ 18వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. ఉదయం దేవాలయంలో నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు, అర్చనలను నిర్వహించారు. ప్రాతఃకాల ఆరాధన, సేవాకాలం, శాంతిపాఠం, వేదవిన్నపం, చతుస్థాన అర్చన, చక్రబ్జ మంగళారాధన, నిత్యహోమం, మహాపూర్ణాహుతి, నిత్య హోమాలు జరిగాయి. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి విశేష హోమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు భార్గవస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పుష్కరిణిలో చక్రస్నానం, బలిహరణ జరిగాయి. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు రాఘవేందర్, గోవర్ధన్, ఉమామహేశ్వరరావు, సంతోష్ తదితరులతో పాటు కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కలుషితనీరు.. తాగేదెలా?

ఆవేదన వ్యక్తంచేస్తున్న ప్రజలు

గచ్చిబౌలి, మే 14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో కలుషితమైన నీరు సరఫరా అవుతుంది. బుధవారం మెట్రో వాటర్ సిబ్బంది తాగునీటిని సరఫరా చేయగా, నీరు ప్రారంభమైన సుమారు 15 నిమిషాల పాటు పూర్తిగా కలుషితంగా మోరీ నీళ్లు రావడం స్థానికుల్లో కలవరం మొదలైంది. వచ్చేదే అరగంట.. అందులో దాదాపు 15 నిమిషాలు ఈ నీరు వస్తే ఎలాఅని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంజయ్యనగర్‌లోని కాకతీయ ఆసుపత్రి వెనకభాగం బస్తీలో సుమారు ఆరునెలల నుంచి ఈ విధంగా నీరు వస్తుందని ఈ ప్రాంత వాసులు తెలిపారు. అయితే తాము సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు బయట వదులుతామని ఆ తరువాత వచ్చిన నీటినే పట్టుకుంటున్నామని వివరించారు. తాగేందుకు మాత్రం డబ్బానీటిని కొనాల్సి వస్తుందని తెలిపారు. విషయాన్నీ లైన్ మెన్‌కు తెలియజేసినా ఫలితంలేదని అంటన్నారు ఈ బస్తీ వాసులు. తరచూ ఈ ప్రాంతవాసులు రోగాల బారినపడుతున్నా సిబ్బంది చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అంజయ్యనగర్‌లో సరైన మురుగు నీటి వ్యవస్థలేకపోవడం వల్ల మురుగు కాలువ నీరు మంజీరా పైపులైనులో పగిలిపోయి తాగునీటి పైపులో కలుస్తుందని బస్తీ వాసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు ఈ విషయమై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కలుషిత నీరు



అంజయ్యనగర్ బస్తీలో బుధవారం సరఫరా అవుతున్న మంజీరా నీరు

ఎంఐజీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఆంక్షలు సడలించండి

ఖేల్‌కాలనీ, మే14 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల ఎస్‌బీఐ నుండి ఎంఐజీకాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని యాజమాన్యం మూసివేయడంతో జనరల్ ఆసుపత్రికి వెళ్లే విశ్రాంతి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆసుపత్రికి వెళ్లే వారికి సడలింపు ఇవ్వాలని కోరుతూ ఎంఐజీ కాలనీ ఫేస్1 సొసైటీ సభ్యులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు కాలనీ సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రావు, మాజీఅధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు టౌన్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ ఎస్టేట్ ఏజీఎం సురణ్‌ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. యాజమాన్యం తీసుకుంటున్న చర్యల వల్ల ఎంఐజీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ప్రతీ రోజు వైద్యచికిత్సల కోసం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల ఆసుపత్రికి వెళ్లే వారు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఆంక్షల్లో సడలింపు చేపట్టి ఆసుపత్రికి వెళ్లేవారిని గేటునుండి వెళ్లేందుకు అనుమతించాలని కోరారు.



ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, మే14 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పీజేఆర్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబు నిర్మాణాలు పూర్తయిందన్నారు. స్లాబును మంచిగా క్యూరింగ్ చేయించాలని అధికారులకు తెలియజేశారు. పీజేఆర్‌నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందన్నారు. అందరికి సౌకర్యవంతంగా ఉండేలా ఫంక్షన్‌హాల్‌ను అన్ని హంగులతో సకల సౌకర్యాలతో నిర్మిస్తామని తెలియజేశారు. ఫంక్షన్‌హాల్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఫంక్షన్‌హాల్, చిల్డ్రన్ పార్కు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పోశెట్టిగౌడ్, యాదగిరి, అగ్రవాసు, ముజీబ్, మహేష్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అంజయ్యనగర్‌లో అడుగడుగునా బెల్ట్ షాపులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు

గచ్చిబౌలి, మే 14 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో అడుగడుగునా బెల్ట్ షాపులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అంజయ్యనగర్, సిద్దీఖీనగర్, గచ్చిబౌలి వడ్డెర బస్తీలల్లో సుమారు 15 వరకు బెల్ట్‌షాపులు ఉన్నాయని, వీటివల్ల తీవ్ర సమస్యలు పడుతున్నామని ఈ ప్రాంత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల మధ్యలో దుకాణాలు ఉండడంవల్ల మద్యం ప్రియులు తెల్లవారక ముందే ఫూట్‌గా తాగి ఇళ్లల్లో నానా అల్లర్లు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువ శాతం దినసరి కూలీలు, కార్మికులు నివాసం ఉంటున్నారు. వీరు పొద్దంతా కష్టపడితేనేగానీ పూటగడవని పరిస్థితులు ఉన్నాయి. కూలీ దబ్బులు మొత్తం మద్యానికే ఖర్చుచేస్తున్నారని వారు వాపోతున్నారు. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదుచేస్తే వారు వచ్చి బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారితో మిలాఖత్ అవుతున్నారే తప్పా షాపులను అదుపుచేయడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ ప్రాంతాల్లో ఉన్న బెల్ట్ షాపులను అరికట్టాలని ఈ ప్రాంత మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం: రవియాదవ్

గచ్చిబౌలి, మే 14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకు వస్తామని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు మారబోయిన రవియాదవ్ అన్నారు. బుధవారం సాయినంద్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కొంతమంది ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కొత్తగా పార్టీలో చేరినవారందరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కేఎన్ రాములు, పవన్, స్వామినాథన్, సాయి, గడ్డం శ్రీనీవాస్ యాదవ్, అనీత, పద్మ, రేణుకా, నాగమణి, సునంద, గంగాధర్ కల్యాణితో పాటు పలువురు మసీదుబండ తదితర ప్రాంతాలనుంచి సుమారు 50మంది బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

అల్లిబిల్లి తీగలు.. పొంచి ఉన్న ప్రమాదం

ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలకు అల్లుకున్న చెట్ల తీగలు

ఆందోళనకు గురవుతున్న స్థానికులు



ట్రాన్స్‌ఫార్మర్‌కు అలుముకున్న చెట్ల తీగలు



విద్యుత్ తీగలకు చెట్లతీగలు

మియాపూర్, మే14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు అడ్డంకులను తొలగించి నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా వేసవిలో విద్యుత్ తీగలకు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలు, చెట్లతీగలను తొలగించేందుకు ప్రైవేట్ వ్యక్తులను టెండర్ ఇచ్చి వాటిని తొలగిస్తారు. అయితే ఈసారి ఈ ప్రక్రియ పూర్తయ్యింది.. కానీ చందానగర్ డివిజన్ ఇందిరానగర్ ట్రాన్స్‌పార్మర్‌తో పాటు విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు, తీగలు అలుముకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని రోడ్డు మార్గంలో వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అయినా విద్యుత్ అధికారులు మాత్రం మొద్దు నిద్రలో జోగుతున్నారు. తారానగర్ పోచమ్మ దేవాలయం నుంచి చందానగర్ పీజేఆర్ స్టేడియానికి వెళ్లే మార్గం ఇందిరానగర్ శ్మశాన వాటిక ముందు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌తోపాటు తీగలకు చెట్ల కొమ్మలు, తీగజాతులు అలుముకున్నాయి. అసలే వేసవి కాలం విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుంది. దీంతో కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

చెట్ల కొమ్మలను తొలగిస్తాం

విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు, చెట్లజాతి తీగలు అల్లుకున్న విషయం మా దృష్టికి రాలేదు. అడ్డుగా ఉన్న వాటిని తొలగిస్తాం. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం.
- సుమన్, ఏఈ హుడాకాలనీ సబ్ స్టేషన్


సూరారం పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నుద్దేశించి మాట్లాడుతున్న సీపీ అవినాష్ మహంతి

సూరారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

గాజులరామారం, మే 14 (ఆంధ్రజ్యోతి):సూరారం పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు వేగవంతం చేసి కేసులను పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ఏడీసీపీ పురుషోత్తం, ఏసీపీ శంకర్ రెడ్డి డీఐ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సును ప్రారంభించి, డ్రైవర్‌కు స్వీట్ తినిపిస్తున్న ధన్‌రాజ్ యాదవ్

సామాన్యుడి ప్రయాణ నేస్తం ఆర్టీసీ బస్సు

నిజాంపేట్, మే 14(ఆంధ్రజ్యోతి): సామాన్యుడి ప్రయాణ నేస్తం ఆర్టీసీ బస్సు అని నిజాంపేట మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్‌తో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుంచి నగరంలోని దూర ప్రాంతానికి వెళ్లి వచ్చేందుకు వీలుగా బస్సు సౌకర్యం కల్పించాలని డబుల్ బెడ్ రూమ్‌వాసులు గతంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారని, దీంతో ఆయన ఆర్టీసీ అధికారులతో సమావేశమై కొత్త బస్సు సర్వీసును ఏర్పాటు చేయించారన్నారు. కార్యక్రమంలో తలారి రాము, గోపాల్‌నాయక్, సలీమ్,జావేర్, రాంరెడ్డి, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి: సీఐటీయూ

నిజాంపేట్, మే 14(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మేడ్చల్ జిల్లా సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. బాచుపల్లి మున్సిపల్ వార్డు కార్యాలయంలో తెలంగాణ మున్సిపల్ వర్కింగ్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, కార్పొరేట్ పెట్టుబడిదారుల దోపిడీని పెంచే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు కాం ట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ఆదివారాలు, పండుగల సందర్భంగా సెలవులు వర్తింపజేయాలని, డబుల్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహ, శ్రీను, వెంకట్, లక్ష్మి, రత్నం, పెంటమ్మ, రేణుక, యాదమ్మ పాల్గొన్నారు.



సిబ్బందితో మురుగు నీటి పైప్‌లైన్‌ను శుభ్రం చేయిస్తున్న కమిషనర్

పైప్‌లైన్‌లో పూడిక తీయించిన కమిషనర్

పేట్‌బషీరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘంలోని బొబ్బిలి అపార్టుమెంట్స్‌లో నిత్యం మురుగు నీరు పొంగి రహదారిపై పారుతోంది. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు జలమండలి సిబ్బంది వచ్చి తూతూ మంత్రంగా గల్పర్‌తో డ్రైనేజీ పైప్‌లైన్‌ను శుభ్రం చేసి వెళ్తున్నారు. మళ్లీ కొద్ది రోజుల్లోనే అక్కడ సమస్య పునరావృతం అవుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి, మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయించి, పైప్‌లైన్‌లో పేరుకుపోయిన మట్టిని సిబ్బందితో తొలగింపజేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ , అపార్టుమెంట్లు, ఆస్పత్రులు వెలిశాయి. దీంతో డ్రైనేజీ పైప్‌లైన్‌పై ఒత్తిడి పెరిగి మురుగునీరు మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు ఉప్పొంగి వస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచి కొత్త పైప్‌లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



పని చేయని సిగ్నల్స్‌ను పట్టించుకోరా?

పేట్‌బషీరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): దూలపల్లిలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పని చేయకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. 24 గంటలు రద్దీగా ఉండే ఈ రహదారిలో సిగ్నల్స్ పని చేయడం లేదు. దీంతో జీడిమెట్ల నుంచి వచ్చే వాహనాలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొంపల్లికి వస్తుండగా, దూలపల్లి నుంచి బహదూర్‌పల్లికి వెళ్తున్న వాహనాలు ఎదురు ఎదురుగా రావడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసినప్పటి నుంచి అవి సక్రమంగా పని చేయడం లేదని ఆప్రాంత వాసులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సిగ్నల్స్ పని చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

'భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి'

అల్లాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ కరెంట్ ఆఫీస్ గల్లీలో కార్పొరేటర్ సబీహా బేగం జలమండలి అధికారి సెక్షన్ మేనేజర్ అన్వేత్ కుమార్, సిబ్బందితో కలిసి బుధవారం పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌లలో సిల్ట్ అధికంగా పేరుకుపోయి మురుగు సమస్యలు తలెత్తుతున్నాయంటూ తరచూ ఫిర్యాదులొస్తున్నాయని జలమండలి అధికారుల దృష్టికి తెచ్చారు. రానున్నది వర్షాకాలం కావున ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ఇదే మంచి తరుణం అనుకున్న కార్పొరేటర్ సత్వరమే సిల్ట్ సమస్యలను ఓ కొలిక్కి తెచ్చి వానాకాలం సర్‌ప్రైజ్‌లను అరికట్టాలని కోరారు. ఎప్పటికప్పుడు మ్యాన్‌హోల్‌లలోని పూడికను తొలగించాలని కార్పొరేటర్ సబీహా బేగం జలమండలి అధికారులను కోరారు.


వాహనాల తాకిడితో కిక్కిరిసిన రోడ్డు


కొనసాగుతున్న ఫ్లైఓవర్ పనులు

ఫ్లైఓవర్ పనులతో నరకయాతన!

- బాచుపల్లి నుంచి మియాపూర్ వైపు గుంతలు పడ్డ రోడ్డు
- వాహనదారుల బేజార్
- నిత్యం ట్రాఫిక్ జామ్
- కొద్దిపాటి వర్షం పడితే సమస్య మరింత జటిలం


బాచుపల్లి నుంచి మియాపూర్ వైపు కొనసాగుతున్న ఫ్లైఓవర్ పనులతో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నిజాంపేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి సిగ్నల్ వద్ద కొనసాగుతున్న బ్రిడ్జి పనులకు తోడు ఇప్పటికే గండిమైసమ్మ, మియాపూర్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు నరక యాతన పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డు గుంతల్లో నీరి చేరి పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదలడంతో గండిమైసమ్మ, మియాపూర్ రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది.

- రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైన ఈ రోడ్డు మార్గంలో ప్రతి రోజూ ట్రాఫిక్ జామ్ అవుతోందని వాహనదారులు వాపోతున్నారు. బాచుపల్లి సిగ్నల్ వద్ద కొనసాగుతున్న బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- రెండేళ్ల క్రితం మొదలైన ఫ్లైఓవర్ పనులు రోజు రోజుకూ ఊపందుకోవాల్సిందిపోయి నెమ్మదిగా సాగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మియాపూర్ వైపు నిర్మించే ఫ్లైఓవర్ పనుల కారణంగా కొద్ది దూరం రహదారిని వన్‌వేగా మార్చారు. దీంతో వాహనాల రద్దీ మరింత పెరిగి, ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది. హెచ్‌ఎండీ అధికారులు, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని వాహనదారులు కోరుతున్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

● జీడిమెట్ల డీఎం ఆంజనేయులు



పేట్‌బషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలో జరిగే సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే పుష్కరాలకు గండిమైసమ్మ, అపురూపకాలనీ, జగద్గిరిగుట్ట నుంచి స్పెషల్ మెట్రోడీలక్స్ బస్సులు నడుస్తాయన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ. 820లు, చిన్న పిల్లలకు రూ. 420లు అని తెలిపారు. కాలనీల నుంచి 35 నుంచి 40 మంది లేదా 20 నుంచి 10 మంది గ్రూప్‌లు పుష్కరాలకు వెళ్లే భక్తులు 9959226150, 7382817481 నెంబర్లకు కాల్ చేసి సమాచారం ఇస్తే వారి కాలనీకే బస్సు పంపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జీడిమెట్ల డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఆంజనేయులు కోరారు.

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, మే14 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబు నిర్మాణాలు పూర్తయిందన్నారు. స్లాబు ను మంచిగా క్యూరింగ్ చేయించాలని అధికారులకు తెలియజేశారు. పీజేఆర్‌నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందన్నారు. అందరికి సౌకర్యవంతంగా ఉండేలా ఫంక్షన్‌హాల్‌ను అన్ని హంగులతో సకల సౌకర్యాలతో నిర్మిస్తామని తెలియజేశారు. ఫంక్షన్‌హాల్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

రాత్రివేళ అప్రకటిత విద్యుత్ కోత

● ఉక్కపోత, దోమలతో నిద్ర కరువు

● వారం రోజులుగా ఇందిరానగర్‌వాసుల అవస్థలు


ఇందిరానగర్

గాజులరామారం, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల పర్య వేక్షణ లోపం వల్ల బస్తీలు, కాలనీల్లో రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ప్రజలు వాపోతున్నారు. గాజుల రామారం డివిజన్‌లోని ఇందిరానగర్, హెచ్‌ఏఎల్ ఫేజ్-2లో గత వారం రోజుల నుంచి రాత్రి 10.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండటం లేదని వాపోతున్నారు. అసలే ఎండా కాలం ఉక్కపోత, దీనికి తోడు దోమల విజృంభణ.. ఫ్యాన్లు తిరగకపోవడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని బస్తీలు, కాలనీల ప్రజలంటున్నారు. పొద్దంతా ఉద్యోగం తదితర పనులు చేసి కష్టపడి ఇంటికి చేరుకునే తాము రాత్రి ప్రశాతంగా నిద్రపోదామంటే కరెంట్ పోతోందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. కరెంట్ లేకపోవడంతో ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారని, నెల నెలా విద్యుత్ బిల్లులను వసూలు చేయడం, ఒక్క నెల ఆలస్యమైే కరెంట్ కనెక్షన్ కట్ చేసే అధికారులు.. ఈ అప్రకటిత విద్యుత్ కోతలను ఎందుకు నివారించడం లేదని వినియోగదారులు మండి పడుతున్నారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవం లేదని, ఫోన్ చేస్తే సిబ్బంది అందుబాటులోకి రావడం లేదని ఆరోపిస్తున్నారు.ఈ సమస్యను ఎవరికి చెప్పాలో అర్థం కాక ఉక్కపోతలోనే గడుపుతున్నామని పలువురు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



వారం రోజుల నుంచి రాత్రి వేళల్లో కరెంట్ పోతోంది. ఫ్యాన్లు తిరగడం లేదు. అసలే వేసవి కాలం. ఉక్క పోత వల్ల నిద్రపట్టడం లేదు. వృద్ధులు, చిన్న పిల్లల అవస్థలు వర్ణణాతీం. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

\- దేవూరి శ్రీకాంత్, ఇందిరానగర్


గాజులరామారం చౌరస్తాలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

రోడ్డు పనుల్లో జాప్యం.. ప్రమాదాల బారిన జనం

గాజులరామారం, మే 14 (ఆంధ్రజ్యోతి): నెమ్మదిగా జరుగుతున్న రోడ్డు పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గాజులరామారం గ్రామ చౌరస్తాలో అధికారులు రెండు నెలల కిత్రం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. చౌరస్తాకు ఇరువైపులా ఉన్న రోడ్డులను విస్తరించి, కొత్త రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. పనుల్లో భాగంగా చౌరస్తా నుంచి హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వరకు రోడ్డు వేసేందుకు రోడ్డు అంచులను తవ్వి, కంకర పోసి వదిలేశారు. ముందు జాగ్రత్త చర్యగా అక్కడ హెచ్చరిక బోర్డులు వంటివి ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు తవ్వి వదిలేసి రోడ్డుపై అదుపుతప్పి జారిపడిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గాజులరామారం గ్రామ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లిదండ్రులూ ఇది మీకు తగునా?

● మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహిస్తున్న వైనం



కుత్బుల్లాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలను నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్నారులకు వాహనాలు ఇవ్వొద్దని ఒకపక్క విజ్ఞప్తి చేయడంతో పాటు కేసులు పెడతామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నా తల్లిదండ్రులు లెక్క చేయడం లేదు. డ్రైవింగ్‌పై ఎలాంటి అవగాహన లేకపోయినా తమ పిల్లల కోరికను కాదనలేక కొందరు ద్విచక్ర వాహనం ఇచ్చి రోడ్లపైకి పంపుతున్నారు. మరికొందరైతే ఏకంగా తమ పిల్లలు వాహనం నడుపుతుంటే వారు వెనుక కూర్చొని ప్రోత్సహిస్తున్నారు. దీనికి ఈ చిత్రమే ఉదాహరణ. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ప్రసూననగర్ నుంచి వివేకానందనగర్ మీదుగా సుచిత్ర వైపు బాలుడు స్కూటీ నడుపుతుంటే ఓ మహిళ వెనకాల కూర్చుని ప్రయాణం చేసింది. పోలీసులు ఇలాంటి వారిని గుర్తించి అవగాహన కల్పిస్తే ప్రమాదాలను కొంతైనా అరికట్టవచ్చని స్థానికులు పలువురు పేర్కొన్నారు.

చెత్త డబ్బాలు వినియోగించేలా చూడాలి: జెడ్సీ



హెచ్‌పీరోడ్డులో రాంకీ సంస్థ ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలను పరిశీలిస్తున్న జెడ్సీ అపూర్వచౌహాన్

ఫతేనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): బస్తీలలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న చెత్త డబ్బాలలో స్థానికులు చెత్తను రోడ్ల మీద కాకుండా చెత్త డబ్బాలలోనే వేసే విధంగా ప్రజలకు వివరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ (జెడ్సీ) అపూర్వచౌహాన్ అధికారులకు, శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీ రోడ్డులో రాంకీ సంస్థ కొత్తగా ఏర్పాటు చేసిన 35 లీటర్ల చెత్త డబ్బాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ, ఇప్పటికే డివిజన్ పరిధిలోని జింకల వాడ తదితర బస్తీలలో చెత్తడబ్బాలు పెట్టడం జరిగిందని అవి సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనని సూచించారు. కార్యక్రమంలో మూసాపేట్ సర్కిల్ ఏఎంహెచ్ఓ కార్తీక్, జమీల్ అహ్మద్, ఎస్సార్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు వేస్తే మళ్లీ తవ్వాల్సిందే!

- సర్కిల్ అధికారుల మధ్య సమన్వయ లోపం !
- ప్రజాధనం వృథా అయ్యే అవకాశం
- తాగునీటి సరఫరాలో సమస్యతో రోడ్డు పనుల నిలిపివేత
- పైప్‌లైన్ల మరమ్మతును పట్టించుకోని జలమండలి అధికారులు

కుత్బుల్లాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): 'దేవుడు వరమిచ్చినా... పూజారి కరుణించడం లేదు' అనే చందంగా మారింది బలహీన వర్గాల కాలనీల ప్రజల పరిస్థితి. అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వాజ్‌పాయినగర్, సంజీవయ్యనగర్‌ల్లో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యే అవకాశముంది.

- వాజ్‌పాయినగర్ ఒకటవ రోడ్డు, సంజీయ్యనగర్ సరిహద్దులో శిథిలమైన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కింది భాగంలో ఉన్న ప్రసూననగర్ రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షం కురిసిన ప్రతి సారి వరద నీరు వాజ్‌పాయినగర్, సంజీయ్యనగర్ రోడ్లలో నిల్వ ఉంటోంది. దీంతో వర్షం పడితే చాలు రాత్రి సమయంలో ఈ బస్తీల వాసులు జాగారం చేయడం పరిపాటిగా మారింది. స్థానికుల విజ్ఞప్తుల మేరకు అధికారులు సీసీ రోడ్డు ఎత్తుగా వేసేందుకు నిధులను మంజూరు చేశారు.
- దశాబ్దాల తర్వాత రోడ్డు వేస్తుండటంతో స్థానికులు సంబరపడ్డారు. రోడ్డు వేస్తామని అధికారులు కంకర వేసి రోడ్డును చదును చేశారు. అయితే తాగునీరు సరిగా సరఫరా కాకపోవడంతో ఇప్పుడిప్పుడే ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. రోడ్డును వేస్తే తాగునీటి పైప్‌లైన్ పనులకు మరమ్మతులు చేయడం కష్టమని, రోడ్డును వేయకముందే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు పనులను ప్రారంభించకుండా ఒక వారం రోజులు ఆపాలని ఇంజినీరింగ్ అధికారులను కోరడంతో పనులను నిలిపారు. ఈ సమస్యను జలమండలి అధికారులకు వివరించగా పట్టించుకోవడంలేదని, తమ బస్తీలో ఒకసారి పర్యటిస్తే సమస్య అర్థమవుతుందని అధికారులకు మొరపెట్టుకున్నా పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొంత సమయం ఇచ్చి పనుల నిలివేత

- కాగా, వాజ్‌పాయినగర్‌లో నిలిచిన రోడ్డు పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారిణి పాపమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, వాజ్‌పాయినగర్‌వాసులు నీటి సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో తాను జలమండలి అధికారులకు తాగునీటి సరఫరా సమస్యను వివరించి, కొంత సమయం ఇచ్చి రోడ్డు పనులను ఆపేశామన్నారు. ఇంకా సమస్యను పరిష్కరించుకోలేదని తెలిసిందని ఆమె చెప్పారు. నీటి సమస్య ఉన్న ప్రాంతంలో పనులను నిలిపి వేసి మిగతా చోట రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. దీనిని బట్టి చూస్తే జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయం లేదని కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది.


రోడ్డును వేసేందుకు చదును చేసి కంకర వేయించిన జీహెచ్‌ఎంసీ అధికారులు

ముందు పైప్‌లైన్లకు మరమ్మతు చేపట్టాలి



మా బస్తీలో రోడ్డును వేయడం ఎంతో సంతోషంగా ఉంది. అయితే, తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన తర్వాతే రోడ్డును వేస్తే బాగుంటుంది. ఎంతో కాలం క్రితం వేసిన పైప్‌లైన్‌ను మార్చి కొత్త పైప్‌లైన్ వేస్తే బాగుంటుంది. పాత పైప్‌లైన్ మార్చడం అవసరం లేకుంటే అధికారులు స్వయంగా వచ్చి మా సమస్యను పరిశీలించాలి. సంజీవయ్యనగర్‌లోని మూడు గల్లీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. మధ్యలో వాల్వ్ వేసి నీటిని వదిలితే సమస్య పరిష్కారమవుతుందని అనుకుంటున్నాం

\- రవి యాదవ్, స్థానికుడు